# దివాకర ప్రభ

## పద్యకావ్యం



డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

# యువభారతి ఫౌండేషన్

**పరిచయం:** "చుట్టూరా ఆవరించుకొని ఉన్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడంకంటే, ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అన్న వాక్యమే ఊపిరిగా 1963లో విజయదశమినాడు యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించింది.

**యువభారతి పరిచయం:** ఉత్తమ సాహిత్యాధ్యయనం సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుంది. మనిషిలో అంతర్లీనంగా, నిక్షిప్తమయిన ప్రతిభను వెలికి తీస్తుంది. సాత్వికతను పెంపొందించి, సగటు మనిషి 'మనీషి'గా తీర్చిదిద్దుతుంది. అన్నది యువభారతి నమ్మకం. ఈ ఆశయ సాధనకు కడచిన 45 సంవత్సరాలుగా అనేక సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, 'లహరీ' ఉపన్యాస పరంపరలనేర్పాటు చేసి, ఉన్నత ప్రమాణాలుగల అనేక గ్రంథాలను ప్రచురించి, తెలుగువారి హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందింది.

**యువభారతి ఫౌండేషన్:** మీరందించిన ఈ స్థానాన్ని పదిలపరచుకొని, తెలుగు భాష, సాహిత్య, సంస్కృతులను మరింత అభివృద్ధి పరచి, తెలుగువారిలో మాతృభాషాభిమానాన్ని పెంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడానికి ఒక శాశ్వత నిధినేర్పాటు చేయాలని భావించి, యువభారతి మిత్రులతో కలిసి, "యువభారతి ఫౌండేషన్" పేర ఒక శాశ్వత నిధిని ఏర్పాటు చేయడం జరిగింది.

మీ వంతు సహకారాన్ని మీరెలా అందించగలరు?

మీరు ఈ మా ఉద్యమంలో పాలుపంచుకోవాలనుకుంటున్నారా? అయితే మీవంతు సహాయ సహకారాలు మీరీ కింది విధంగా మాకు అందచేయవచ్చు.

- ☆ మీరు సాహితీవేత్తలు, తెలుగు భాషాభిమానులు అయితే మీ చక్కని సూచనలను, సలహాలను, మాకందించి మా కార్యక్రమాలరూపకల్పనలో మీ వంతు సహకారాన్ని మాకందించవచ్చు.
- ☆ మీరు "మాతృభాష" పై అభిమానం కలవారైతే మీ అమూల్యమైన సమయంలో కొంత సమయాన్ని "యువభారతి ఫౌండేషన్" కార్యకలాపాలనిర్వహణలో వెచ్చించి, మాతో సహకరించవచ్చు.
- ☆ మీరు ఉద్యోగ వ్యాపారాలలో తీరికలేని వారైతే "యువభారతి ఫౌండేషన్"కు విరివిగా విరాళాలనందించి ప్రోత్సహించవచ్చును. మీరిచ్చే ఎంత చిన్న మొత్తాన్నైనా, "యువభారతి ఫౌండేషన్" వినమ్రంగా స్వీకరిస్తుంది.

**యువభారతి ఫౌండేషన్**

ఇ.నెం. 3-6-207/1, మక్దూం మార్గం, 15వ వీధి, హిమాయత్ నగర్,
హైదరాబాద్- 500 029. సెల్: 9247 328 440.

తెలుగు సాహితీవేత్తలు, భాషాభిమానులు, తల్లులు, తండ్రులు, గురువులు, అధికారులు, అనధికారులు, విద్యార్థులు, యువతీయువకులు యావన్మంది తెలుగువారు తమ భాషాభిమానాన్ని ప్రదర్శించి, "యువభారతి ఫౌండేషన్" కార్యక్రమాలకు తమ హార్దిక, ఆర్థిక సహాయ, సహకారాలను అందించి ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం

**యువభారతి ఫౌండేషన్ తరపున**

| ఎ.నాగేశ్వరరావు | ఎ. రామలింగేశ్వరరావు | డా. వంగపల్లి విశ్వనాథం |
|---|---|---|
| కోశాధికారి | మేనేజింగ్ ట్రస్టీ | అధ్యక్షుడు |

# దివాకర ప్రభ

## ఆచార్య దివాకర్ల వేంకటావధాని జీవితం

## పద్యకావ్యం

**డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**

ప్రచురణ

**యువభారతి**

సాహితీ సాంస్కృతిక సంస్థ
ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు
తిలక్‌రోడ్, హైదరాబాద్– 500 001

# *Diwakara Prabha*

A Poem on Aacharya Divakarla Venkataavadhani's Life

by **Dr. Tirumala Srinivasacharya**

© Yuva Bharathi

*First Edition* : 2012

*For Copies* :

**Yuva Bharathi**
Andhra Saraswatha Parishat Buildings
Tilak Road, Hyderabad - 500 001
and
**All Leading Book Shops**

*Book Production* :
**T. Muralidhar Gowd**
9393 176 552

*Cover Design*:
**T. Mallesh**

*D.T.P.*:
**K.B.T. Kondaiah**

*Published by* :
**Yuva Bharathi**
Andhra Saraswata Parishat Buildings
Tilak Road, Hyderabad - 500 001
Ph: 040-2475 3724

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

*Price* : ` **50/-**

# ఆచార్య దివాకర్ల వేంకటావధాని జీవితం

శ్రీ వేంకటాధానిగారు దివాకర్ల వంశంలో పరీధావి నామ సంవత్సర ఆషాఢ పౌర్ణమి (గురుపూర్ణిమ) 23-6-1912 నాడు, 'ఆకుతీగపాడు' (పశ్చిమ గోదావరి జిల్లా) గ్రామంలో అమ్మమ్మ ఇంట్లో జన్మించారు. వారి జన్మనక్షత్రం మూల; తల్లి వేంకమాంబ; తండ్రి సుందర రామయ్య. వారు వైదికులు; వెలనాటివారు; హరిత సగోత్రికులు. కృష్ణ యజుశ్శాఖీయులు. 'యండగండి' గ్రామవాస్తవ్యులు. వేంకటావధాని గారి తాత పేరు కూడా వేంకటావధానియే. తిరుపతి వేంకట కవులలో ఒకరైన శ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు వేంకటావధానిగారికి పినతండ్రి. అవధానిగారు ఏడేళ్ల వయస్సులో ఉండగా (1919లో), తిరుపతి శాస్త్రిగారు స్వర్గస్థులయ్యారు. అవధానిగారి తమ్ముడు శ్రీ దివాకర్ల రామమూర్తిగారు. శేషమ్మ, దుర్గాప్రసాద్ వేంకటలక్ష్మి, బాలాత్రిపు సుందరి అనేవారు అవధానిగారి చెల్లెళ్లు. ఇంటికి పెద్దకొడుకు అవధానిగారే.

వేంకటావధానిగారి తండ్రి ధనవంతుడు కాదు. నిష్ఠాగరిష్ఠులు; సదాచార సంపన్నులు; వారు అవధానిగారికి ఇంట్లోనే సంస్కృతం నేర్పారు. ఆంధ్ర నామ సంగ్రహం, రఘువంశం బోధించారు. అవధానిగారు సహజంగా ధారణాశక్తి గలవారు; చిన్నప్పుడే తిరుపతి వేంకటకవుల అవధాన పద్యాలు కంఠస్థం చేశారు. ఏడవ తరగతి వరకు అవధానిగారు 'యండగండి' గ్రామంలోనే చదివారు. ఉన్నత పాఠశాల విద్యను- సంస్కృతం ప్రథమ భాషగా, తెలుగు రెండవ భాషగా- 'ఉండి'లో చదివి, ప్రథమశ్రేణిలో కృతార్థులయ్యారు. ఈ సమయంలోనే వారి పద్యాలు 'భారతి'లో ప్రచురితమయ్యాయి. అవధానిగారికి బాల్యంలోనే- అనగా తొమ్మిదవ తరగతిలో ఉండగానే పెళ్లి అయింది. భార్య మహాలక్ష్మి; అప్పుడామె వయస్సు ఎనిమిదేళ్లు. అవధానిగారు ఉన్నతపాఠశాలా విద్యాభ్యాస సమయంలో- 1929లో, రాజమండ్రి హిందూ సమాజ నిర్వహణలో జరిగిన భగవద్గీతా పరీక్షలో పాల్గొని ప్రథములుగా విజయం పొంది, పది రూపాయల బహుమతిని అందుకున్నారు.

అవధానిగారు బందరు హిందూ కళాశాలలో 'ఇంటరు' చదువు పూర్తి చేశారు. ఈ సందర్భంలోనే అవధానిగారి పేదరికం చూచి, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు వారికి తమ ఇంట్లోనే వసతి కల్పించారు; మిత్రులతో చెప్పి, వారాలు చేసికొని చదువుకునే పరిస్థితిని కలిగించారు. అవధానిగారు విశ్వనాథవారికి ప్రియశిష్యు లయ్యారు. ఈ సందర్భంలోనే 'ఏకవీర' నవలను విశ్వనాథవారు చెప్పుతుండగా అవధానిగారు వ్రాశారు. అందుకు ఫలంగా పదహారు రూపాయలు ఇచ్చారు విశ్వనాథవారు. ఇంటరు చదువుతున్న సమయంలో అవధానిగారి భార్య శ్రీమతి మహాలక్ష్మి విషజ్వరం వల్ల మరణించింది. అవధానిగారు చాలా కుంగిపోయారు దుఃఖంతో. విశ్వనాథవారు ధైర్యం కలిగించి ప్రోత్సహించారు.

1930-31లో 'ఇంటరు' పూర్తి చేశారు అవధానిగారు. తరువాత, విశ్వనాథ, కొడాలి సుబ్బారావుగార్ల సహకారంతో విశాఖపట్టణానికి వెళ్లి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'బి.ఏ. ఆనర్సు'లో చేరారు. అప్పుడు, ఆంధ్ర శాఖాధ్యక్షులుగా శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు ఉండేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఉండేవారు. ప్రో వైస్ ఛాన్స్‌లర్‌గా జయపురాధీశ్వరులు శ్రీ విక్రమదేవవర్మగారు ఉండేవారు. శ్రీ పాటిబండ మాధవశర్మ గారు అవధానిగారికి సహాధ్యాయిగా ఉండేవారు. శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు, శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు, విద్వాన్ గంటి జోగి సోమయాజిగారు అవధాని గారికి అధ్యాపకులుగా ఉండేవారు. వీరందరూ అవధానిగారి ప్రతిభా పాండిత్యాలనూ, సత్ప్రవర్తననూ మెచ్చి ఆదరించేవారు. అవధానిగారు బి.ఏ. ఆనర్సు రెండవ సంవత్సరంలో ఉండగా మళ్లీ వివాహం జరిగింది. భార్య పేరు శ్రీమతి చంద్రావతి. 1933లో విశ్వనాథ వారు రచించిన 'నర్తనశాల' నాటక ప్రదర్శనలో అవధానిగారు భీముడుగా, పాటిబండ మాధవశర్మగారు 'ద్రౌపది'గా నటించారు. ఈ సందర్భంలోనే డా॥ సర్వేపల్లి రాధాకృష్ణగారి ఆహ్వానం మేరకు విశ్వనాథవారు కవిబ్రహ్మను గూర్చి ఉపన్యసించారు. ప్రాణస్నేహితులైన పాటిబండవారింట్లో అవధానిగారు కాపురం పెట్టారు. వారు తెలుగు 'బి.ఏ. ఆనర్సు'లో ప్రప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ప్రసిద్ధ పండితులైన శ్రీ మానవల్లి రామకృష్ణకవి, శ్రీ గిడుగు రామమూర్తి పంతులు, శ్రీజయంతి

రామయ్య, శ్రీ రాజా విక్రమదేవ వర్మ, శ్రీ వఝ్జల చిన సీతారామశాస్త్రి, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారలు పరీక్షకులుగా విచ్చేసి అవధానిగారి ప్రతిభా పాండిత్యాలను ప్రశంసించారు.

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు అవధానిగారిని 1934లో మిసెస్ ఏ.వి.యన్. కళాశాల (విశాఖపట్టణం)లో తెలుగు పండితులుగా నియమింపజేశారు. అప్పుడు వారి వేతనం నెలకు అరవై రూపాయలే. తెలుగు పండితులుగా అవధానిగారు మంచిపేరు తెచ్చుకున్నారు. ఏ.వి.యన్. కళాశాలలో జరిగిన భారతీ తీర్థ మహాసభల సందర్భంగా, అవధానిగారు ఆదికవి నన్నయభట్టును గూర్చి పద్యాలు వ్రాశారు. అవి పండితకవుల ప్రశంసలందుకున్నాయి. ఫలితంగా శ్రీ విక్రమదేవ వర్మగారి ఆధ్వర్యవంలో అవధానిగారికి 'కవిభూషణ' అనే బిరుద ప్రదానం చేయబడింది. కోసూరి చిన్మయాచారి అనే ఒక వర్తకుని ప్రేరణచే అవధానిగారు, అల్లసాని పెద్దన పాత్ర ధరించి 'కంచుగ్లాసు'ను బహూకృతిగా పొందారు. గ్రంథి పద్మరాజు అనే ఒక సంపన్నుడైన వైశ్యుని ఇంటిలో, విరాటపర్వ పురాణ ప్రవచనం చేసి, వెండి పళ్లాన్ని బహుమతిగా అందుకున్నారు వారు. అప్పుడు జరుగుతున్న ఆంధ్రరాష్ట్రోద్యమ వ్యాప్తికై అవధానిగారు శ్రీ మల్లాది రామచంద్ర శాస్త్రి సోదరులతోనూ శ్రీ విశ్వనాథ వారితోనూ కలిసి ఆంధ్రరాష్ట్రంలోని పలుచోటుల్లో సంచరిస్తూ, సభలు చేస్తూ, ఆంధ్ర సంస్కృతి ఆంధ్ర వాఙ్మయాలపై నాటకాలాడారు; అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని బలపరచారు. ఆంధ్ర రాష్ట్రోదాహరణము, భారత స్వాతంత్ర్యో దాహరణము అనే కావ్యాలను రచించారు. 'భారత స్వాతంత్ర్యోదాహరణము' అనే కావ్యాన్ని ప్రముఖులైన శ్రీ తెన్నేటి విశ్వనాథంగారికి, వారి షష్టిపూర్తి సభలో అంకితం చేశారు. శ్రీ తెన్నేటివారు అవధానిగారి నుండి వేద రహస్యాలను తెలుసుకునేవారు. అవధానిగారు తెన్నేటివారి నుండి ఆంగ్లభాషా పాండితిని ఆర్జించేవారు.

అవధానిగారు 'ధర్మవరం రామకృష్ణమాచార్యులు' అనే విషయంపై విమర్శ వ్యాసం వ్రాసి, ఆంధ్రవిశ్వ విద్యాలయం నుండి మొట్టమొదటిసారిగా తెలుగులో ఎం.ఏ. ఆనర్సు పట్టాను పొందారు. ఫలితంగా అదే కళాశాలలో వారు ఉపన్యాసకులుగా

పదోన్నతిని పొందారు. 'బోర్డ్ ఆఫ్ స్టడీస్' అధ్యక్షులయ్యారు. వారు రచించిన 'కౌముదీ మహోత్సవము' అనే గ్రంథం 'ఇంటర్మీడియట్' పాఠ్యగ్రంథంగా ఎన్నుకోబడింది. ఈ కాలంలోనే 'Five Pandits' పేర, ఎస్.ఎస్.ఎల్.సి. పాఠ్యభాగానికి 'నోట్సు' పుస్తకం వ్రాశారు. ఆ పుస్తకంలో ఎనబై శాతం అవధానిగారి రచనే ఉండింది. వారు 'ఇంటర్మీడియట్' పాఠ్యగ్రంథాలకు కూడా 'గైడ్లు' వ్రాశారు. 1943 మార్చి 5వ తేదీనాడు అవధానిగారి తండ్రి సుందర రామయ్యగారు దివంగతులయ్యారు. తరువాత అవధానిగారు వేదాధ్యయనం మొదలుపెట్టి శ్రీ మహావ్రత చయనులగారి వద్ద నమక చమకములు, దశశాంతులు మున్నగువాటిని వల్లెవేశారు. 1947లో వేద పండిత సభను స్థాపించి, అవధానిగారు ఆ సభకు అధ్యక్షత వహించారు. మహాత్మాగాంధి హత్య సందర్భంగా, రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తగా అవధానిగారిని అనుమానించి, ప్రభుత్వం వారు 24 గంటలు జైల్లో పెట్టారు. జైల్లో వారు మంచినీళ్లను కూడా ముట్టలేదు. విశాఖపట్టణం కళాశాలలో పదునేడు సంవత్సరాలు పనిచేశారు అవధానిగారు.

వారు 1950లో హైద్రాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉపన్యాసక ఉద్యోగానికి అభ్యర్థిగా వెళ్లారు. విశ్వనాథ, నిడుదవోలు వెంకట్రావు, గంటి జోగిసోమయాజి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారలు ఇంటర్వ్యూ చేసి, అవధానిగారినీ వెళ్లటూరి వేంకటరాఘవశర్మగారినీ ఉపన్యాసకులుగా ఎంపిక చేశారు. అవధానిగారు 1951 జులై 31వ తేదీనాడు మిసెస్ ఏ.వి.యన్. కళాశాలకు వీడ్కోలు చెప్పి, 1951 ఆగస్టు 1వ తేదీనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయాంధ్ర శాఖలో ఉపన్యాసకులుగా చేరారు. ఆ సమయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఉండేవారు. 'ఆంధ్ర వాఙ్మయారంభ దశ– నన్నయ భారతము' అనే విషయాన్ని గూర్చి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి, 1957లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాను సాధించారు అవధానిగారు. వారు 1951–57 వరకు ఉపన్యాసకులుగా, 1957–64 వరకు రీడరుగా, 1964–74 వరకు ప్రొఫెసర్‌గా–శాఖాధ్యక్షులుగా పనిచేశారు. తరువాత 1974 నుండి 1975 వరకు 'ఎమినెంట్ ప్రొఫెసర్'గా, 1975 నుండి 1978 వరకు

యు.జి.సి. ప్రొఫెసరుగా, పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు. అలా 27 సంవత్సరాలు ఉద్యోగం చేశారు. వారు మొదట విశ్వవిద్యాలయంలో చేరినప్పుడు బి.ఏ. తరగతిలో శ్రీయుతులు ఎం.కులశేఖరరావుగారు, ఇరివెంటి కృష్ణమూర్తిగారు, పి.యశోదారెడ్డిగారు, సామ్రాజ్యలక్ష్మిగారు విద్యార్థులుగా ఉండిరి. ఎం.ఏ. తరగతిలో శ్రీ సి.నారాయణరెడ్డిగారు, శ్రీ ముద్దసాని రామిరెడ్డిగారు ఇద్దరే విద్యార్థులుగా ఉండేవారు. అవధానిగారితో, తరువాతి కాలంలో సహాధ్యాపకులుగా పనిచేసినవారు శ్రీ గోపాలకృష్ణారావు, శ్రీ బి.రామరాజు, శ్రీ పాటిబండ మాధవశర్మ, శ్రీ సి.నారాయణ రెడ్డి, శ్రీ ఎం.కులశేఖరరావు, శ్రీమతి పి. యశోదారెడ్డి మున్నగువారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయాంధ్ర శాఖలో పనిచేస్తున్నప్పుడు అవధానిగారు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగా చేరిన ఉపన్యాసకులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహించి శిక్షణ నందించారు. సాహిత్య సదస్సులు ఏర్పాటు చేశారు. వరంగల్లులో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఒక స్నాతకోత్తర విద్యాసంస్థను స్థాపించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు కళాశాలలోను, ఆంధ్ర ప్రాచ్యకళాశాల (నల్లకుంట)లోను ఎం.ఒ.ఎల్ కోర్సును ప్రవేశపెట్టడంలో, సముచిత కృషిచేశారు. ఆచార్య ఖండవల్లి వారితో కలిసి అవధానిగారు, ఆంధ్రమహా భారత సంశోధిత ముద్రణకు విపుల పీఠికను సమకూర్చారు. తెలంగాణలోని మారుమూల ప్రాంతాలకు, పిలువగానే వెళ్లి ఉపన్యాసాలిచ్చి తెలుగు భాషాసాహిత్య చైతన్యాన్ని కలిగించారు. అనేక కవిపండితుల గ్రంథాలకు చక్కని పీఠికలూ సమగ్ర సమీక్షలూ సంతరించి రచయితలను ప్రోత్సహించారు. అవధానిగారి పర్యవేక్షణలో మార్గ దర్శకత్వంలో పదిహేను మంది పండితులు డాక్టరేటు పట్టాలను పొందారు. ఒకరు ఎం.ఫిల్ డిగ్రీ తీసుకున్నారు.

ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు నలభైకి మించి గ్రంథాలు రచించారు. రాజసందర్శనము, మధువనము, కలిపరాజయము, త్రింశతి- అనేవి వారి పద్యకృతులు; ప్రకృతి విజయము, శివభక్త విజయము, కిరాతార్జునీయము, శ్రీ విద్యాగద్య రామాయణము, బల్గేరియా జనచరిత్ర, కాదంబరి అనేవి వారి వచన

కృతులు. ఇక వారు విరచించిన విమర్శలు మొదలైనవి– ఆంధ్రనాటక పితామహుడు, ప్రాఙ్నన్నయ యుగము, ఆంధ్రవాఙ్మయారంభము, ఆంధ్రమహాభారతము– కవిత్రయము, నన్నయ కవితావైభవము, నన్నయభట్టారకుడు, నన్నయభట్టు, నన్నెచోడుని కుమారసంభవము– భాషాప్రయోగములు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యుల ప్రశంస, తిరుపతి వేంకటకవులు, గురుశిష్యులు, వేమనయోగి, పరశురామ పంతుల జీవితము– సాహిత్యము, పోతన (తెలుగులో–ఇంగ్లీషులో), వాల్మీకి–విశ్వనాథ; ఆదికవి వాల్మీకి, ఆంధ్రవాఙ్మయ చరిత్ర, ఆంధ్రవాఙ్మయారంభదశ– ప్రబంధవాఙ్మయము, మళయాళ వాఙ్మయ చరిత్ర, సాహిత్య సోపానములు, భాషాశాస్త్ర విమర్శ సూత్రములు, కవిసమ్రాట్ విశ్వనాథ, అల్లా ఉద్దీను వింతలాంతరు, 30 రోజులలో తెలుగు, కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత (వ్యాఖ్యానం), వ్యాసావళి, సంస్కృత వ్యాకరణ సంగ్రహము, విశాలాంధ్రోదాహరణము, భారతస్వాతంత్ర్యో దాహరణము, సుందర సందేశము– గేయ సుందరకాండము, కౌముదీ మహోత్సవము, నాగానందము, భగవద్గీత యథాతథము (అనువాదము), శివానందలహరి (టీకా తాత్పర్యములు), సౌందర్యలహరి (టీకా తాత్పర్యములు) మున్నగునవి. ఇంక వారి పీఠికలు, వ్యాసాలు సహస్రాధికంగా ఉన్నాయి.

శ్రీ అవధానిగారు గ్రంథకర్తలే కాక బహుగ్రంథ స్వీకర్తలు కూడా. శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యులు గారి ఉదయరాగము, శ్రీ గాజుల వీరయ్యగారి 'సోహ్రాబు–రుస్తుము' ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారి 'లఘు సిద్ధాంత కౌముది'– ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి 'పిల్లలమర్రి పిన వీరభద్రకవి', శ్రీ జానుకవిగారి 'మానవత', శ్రీ వేమూరి వేంకట కవిగారి 'కాదంబరి' అనే గ్రంథాలను వేంకటావధానిగారు అంకితంగా స్వీకరించారు. అవధానిగారు ఆకాశవాణిలో శతాధిక ప్రసంగాలు చేశారు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు కళాప్రపూర్ణ (1977) బిరుదుతో, శ్రీరామలింగ సేవాసంస్థవారు 'విద్యాసనాథ' (1982) బిరుదుతో, భారతీ తీర్థ మహాసభవారు 'కవిభూషణ' (1938) బిరుదుతోను శ్రీ వేంకటావధానిగారిని సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు అవధానిగారిని 'విశిష్ట సభ్యులు'గా గౌరవించారు

1973లో. అవధానిగారి 'సాహిత్య సోపానములు' అనే గ్రంథం 1967-68 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి అవార్డును అందుకున్నది.

శ్రీ దివాకర్ల వారికి అనేక సంస్థలతో సన్నిహిత సంబంధాలుండేవి. వాటిలో ఆంధ్రసారస్వత పరిషత్తు, యువభారతి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం, సంస్కృత భాషా ప్రచార సమితి, ఆర్ష విజ్ఞాన సమితి, విజ్ఞాన దీపిక, సురభారతి, శ్రీ విద్యాసేవా సమితి, శ్రీమద్భాగవత పరిషత్తు, విశ్వహిందూ పరిషత్తు, తెలుగు అకాడమీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, ప్రపంచ తెలుగు మహాసభలు, యు.జి.సి. సంస్థ, రామకృష్ణ మఠం, కళాస్రవంతి అనేవి ముఖ్యమైనవి. అవధానిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి ఆస్థాన మహావక్తలుగా ఉండిరి. వారు జ్ఞాన పీఠానికి ఆంధ్రప్రదేశ్ సలహా సంఘ అధ్యక్షులుగా ఉన్నప్పుడే, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారికి జ్ఞానపీఠ పురస్కారం రావడం గమనీయం.

ఈ సందర్భంలో ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికీ 'యువభారతి' సంస్థకూ ఉన్న సాహిత్యానుబంధం సర్వదా స్మరణీయం. ఆచార్య అవధానిగారు యువభారతికి నిర్దుష్టమైన కార్యక్రమాన్ని అందించి, ప్రోత్సహించి, ఆశీర్వదించి, వెన్నెముకలా అన్ని వేళలా పెద్ద దిక్కై, దాదాపు రెండు దశాబ్దాలపాటు నేతృత్వం వహించిన 'సాహిత్యోద్యమ కర్ణధారులు'. యువభారతి చేపట్టిన 'లహరి ఉపన్యాస కార్యక్రమాలు'- అవధానిగారు శ్రీకారం చుట్టి ప్రారంభించినవే. 1970లో, 1972లో యువభారతి ప్రచురించిన 'రచన', 'మహతి' గ్రంథాలకు అవధానిగారు 'మారుతున్న విలువలు-విమర్శకుల కర్తవ్యము', సంప్రదాయ కవిత్వము, ఉస్మానియా విశ్వవిద్యాలయము-తెలుగులో పరిశోధనలు- అనే వ్యాసాలను ప్రసాదించారు.

ఇక 1971 నుండి 1986 వరకు అనగా 'కావ్యలహరి' నుండి 'జగద్గురు సాహితీలహరి' వరకు సాగిన లహరి ఉపన్యాస పరంపరలో, ఆచార్య అవధానిగారు శ్రీనాథుని శృంగార నైషధము, అల్లసాని పెద్దన మనుచరిత్రము, నంది తిమ్మన పారిజాతాపహరణము, భట్టుమూర్తి వసుచరిత్రము, చేమకూర వేంకటకవి

విజయవిలాసము, తిక్కన సోమయాజి, నన్నయభట్టారకుడు, తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ, నాచన సోముడు, వాల్మీకి రామాయణము, ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యము, వానమామలై వరదాచార్యులవారి 'పోతన చరిత్రము', కాళిదాస అభిజ్ఞాన శాకుంతలము, తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయము, మహాభారతము–మహాకావ్యము, సౌందర్యలహరి– శివానందలహరి అనే అంశాలను గూర్చి మహోపన్యాసాలు చేశారు. ఆ ఉపన్యాస సభలు యువభారతి చరిత్రలోనే గాక జంటనగరాల సాహిత్య చరిత్రలోనే అపూర్వం. వేల సంఖ్యలో వచ్చి శ్రోతలు ఆనందించారు. వసుచరిత్రమును గూర్చి అవధానిగారు ఉపన్యసిస్తుంటే వర్షంలో గొడుగులు పట్టుకొని శ్రోతలు ఉపన్యాసంవిన్న దృశ్యం ఎప్పుడూ మరచిపోలేనిది.

అవధానిగారి ఉపన్యాసాలన్ని లహరీ గ్రంథ పరంపరలో ప్రచురితాలై, ఆధునిక విద్యార్థులకు ఆదర్శ వ్యాసాలుగా ఇప్పటికీ గౌరవాన్ని పొందుతున్నాయి. ఇవిగాక, అవధానిగారు యువభారతికి 'నన్నయ కవితావైభవము' అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాసి ఇచ్చారు 1976లో. అంతేకాకుండా, వారు 'ఆంధ్ర కవి నక్షత్రమాల' అనే పేరుతో ప్రముఖులైన నలభై మంది తెలుగు కవుల జీవిత కావ్య విశేషాలను విశదీకరిస్తూ ఇరవై ఏడు (27) గ్రంథాలను, యువభారతి సంస్థ పక్షాన తెలుగు జాతికి అందించాలనే ఒక మహా సంకల్పానికి, రూపకల్పన చేసి మొదటి గ్రంథం 'నన్నయభట్టు'ను గూర్చి వ్రాసి ఇచ్చారు.

దైవం అనుకూలించలేదు. వారు 1986లో దివంగతులయ్యారు. 'నన్నయభట్టు' గ్రంథాన్ని యువభారతి, డిసెంబరు 1986లో ప్రచురించింది. ఆచార్య దివాకర్ల వేంకటావధాని 'దివ్యస్మృతి'కి భక్తి పురస్సరంగా, కృతజ్ఞతాపూర్వకంగా అభివందనాలను సమర్పించింది. ఈ సందర్భంలో అవధానిగారిని గూర్చిన ఆచార్య సి.నారాయణరెడ్డి గారి మాటలు పేర్కొనదగినవి– "ఆ మధ్య ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాంగణంలో యువభారతి ఆధ్వర్యంలో ప్రాచీనాంధ్ర కవులను గూర్చి వారిచ్చిన ఉపన్యాసాలు విజ్ఞాన వినోద భావతుందిల మరందకోశాలు. అందుకు సాక్షులు ఆ సభల్లో దశ సహస్రాధిక సంఖ్యలో మూగిన సభ్యమధువ్రతాలు".

శ్రీమతి చంద్రావతీ శ్రీ వేంకటావధాని దంపతులకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కూతుళ్లు. పెద్ద కొడుకు శ్రీ దివాకర్ల సీతారామశర్మగారు 'ఇంజనీర్ ఇన్ చీఫ్'గా రిటైర్ అయ్యారు. వారి శ్రీమతి ఇందిరగారు. అవధానిగారి రెండవ కుమారుడు శ్రీ దివాకర్ల లలితా భాస్కర శాస్త్రిగారు. వారు డాక్టరు. వారి శ్రీమతి డా॥ లక్ష్మీ పద్మినిగారు. ఇద్దరూ ఆస్ట్రేలియాలో ఉన్నారు. ఇక అవధానిగారి పెద్ద కూతురు శ్రీమతి మహాలక్ష్మిగారు. ఈమె భర్త శ్రీ చావలి రామమూర్తిగారు. రెండవ కుమార్తె పేరు వేంకట లక్ష్మి. ఈమె భర్త శ్రీ ఆచంట సుబ్రహ్మణ్యంగారు. మూడవ కుమార్తె గాయత్రి గారు. ఈమె తెలుగు ఉపన్యాసకురాలు. ఈమె భర్త శ్రీ దీక్షిత్‌గారు. నాల్గవ కూతురు డా॥ రాజేశ్వరిగారు. ఈమె తెలుగు ప్రొఫెసర్‌గా బెంగుళూరులో ఉన్నారు. ఈమె భర్త శ్రీ చుక్కా వెంకటయ్యగారు. అవధానిగారి చివరి కుమార్తె పేరు అరుణశ్రీ. ఈమె భర్త శ్రీఏలేశ్వరపు శేషతల్పశాయిగారు. వీరందరూ సంతాన వంతులయ్యారు.

శ్రీ దివాకర్లవారు శ్రీ విద్యాసేవా సమితి సంస్థ అధ్యక్షులుగా ఉండి, శ్రీ విద్యా విశేషాలను గూర్చి ప్రసంగాలు చేసేవారు. ప్రతి శరన్నవరాత్రి ఉత్సవాలకు, శ్రీ విద్యాసేవాసమితి వారు ఏర్పాటు చేసే కేంద్రాలకు వెళ్లి ఉపన్యాసాలిచ్చేవారు. అవధానిగారు 1986 అక్టోబరులో భారతీయ విద్యాభవన్ ముంబయిలో జరిగే చండీయాగానికి వెళ్లారు. అక్కడ సభలో వారు 'సౌందర్యలహరి'ని గూర్చి ఇంగ్లీషులో అద్భుతంగా ఉపన్యసించారు. సాధారణంగా అవధానిగారు నిలబడి ప్రసంగించేవారు. కాని వారు కూర్చుండి ఉపన్యసించడం చూచి, శ్రోతలలో ఉన్న ప్రముఖులైన డాక్టర్లు వారిని పరీక్షించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. అందుకు అవధానిగారు అంగీకరించారు. విజయదశమి రోజు చండీయాగం పూర్తి అయింది. 1986 అక్టోబరు 20వ తేదీనాడు, జైన్ ఆసుపత్రిలో డాక్టర్లు, అవధానిగారికి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామని అన్నారు డాక్టర్లు. కాని ఆ రాత్రి రక్తస్రావం మొదలయింది. డాక్టర్లు రక్తస్రావాన్ని ఆపడానికి యత్నించి విఫలులయ్యారు. 1986 అక్టోబరు 20వ తేది రాత్రి పన్నెండు గంటల 45 నిముషాలకు (అనగా తేది ప్రకారం 21 నాడు) అవధానిగారు తుది శ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్ ఒక మహా సారస్వతమూర్తిని కోల్పోయింది. అవధానిగారు తెలుగు సంస్కృతి భాషా సారస్వతాలకు చేసిన సేవ అమూల్యం; అమోఘం; నిత్యస్మరణీయం; వారు చిరస్మరణీయులు.



*డా॥ తిరుమల శ్రీనివాసాచార్య*

**ఉపనిషత్ సుధా లహరి డి.వి.డిలు అందుబాటులో ఉన్నాయి.**

ఉపనిషత్ సుధా లహరి ఉపన్యాసమంజరి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించలేక పోయినందుకు చింతిస్తున్నారా? ఇపుడా అవసరం లేదు. ఉపనిషత్ సుధా లహరి ఆరు రోజుల కార్యక్రమాలను మూడు డి.వి.డిలు.గా రూపొందించడం జరిగినది. ఉపనిషత్ సుధా లహరి పుస్తకంతోసహా వాటి విలువ కేవలం రూ॥ 150/– (నూట యాభై రూపాయలు) మాత్రమే! వెంటనే డి.వి.డి. సెట్‌ను సొంతం చేసుకోండి.

లహరి కార్యక్రమాలను ఇంట్లో చూచి ఆనందించండి.

వివరాలకు సంప్రదించండి.

**అయలసోమయాజుల నాగేశ్వరరావు**
కార్యదర్శి
చరవాణి : 9247328440

**మాడభూషి అనంతాచార్యులు**
అధ్యక్షుడు
చరవాణి : 9290702328

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Diwakara+Prabha**

* * *